# విస్మృతి




**కులవ్యవస్థ పూర్తిగా విచ్ఛిన్నమైపోయే రోజు దగ్గర్లో లేకున్నా, ఆ దిశగా మన సమాజం అనివార్యంగా, నిస్సందేహంగా పయనిస్తున్నదని ఈ కథ చాటి చెప్తోంది.**

నేను ఇంతకాలంగా ఒక్కసారీ పెదవి విప్పలేదు. ఇప్పుడు మీకు కొన్ని విషయాలు చెప్పాలని నాకనిపించింది. ఇవే నా తొలి పలుకులూ, తుది పలుకులూ కూడా. మీలాగే నాకూ ఇష్టులూ, అయిష్టులూ ఉన్నారు. ఇది వాళ్ళ మంచిచెడ్డల వల్ల ఏర్పడిన అభిప్రాయం.

పిరాట్ల శంకరశాస్త్రి అంటే నాకిష్టం. నాకే కాదు, అప్పట్లో అతనంటే అందరికీ ఇష్టమే. దబ్బపండు ఛాయ, నున్నని గుండు, చివర చిన్న పిలక, నుదుట విభూతి రేఖలు, మధ్య చిన్న బొట్టు. వేదాలు చదివాడు. నియమ నిష్ఠలతో ఉండేవాడు. పుణ్యకార్యాలు జరిపించేవాడు. కాస్త విశ్రాంతి దొరికితే, నా

చిత్రాలు : పి. ఎస్. బాబు



**“ఎలా కుదురుతుందండీ? మీరు మీ కులంలోనూ, నేను నా కులంలోనూ తలెత్తుకు తిరగ్గలమా?”**

నీడన పురాణాలు చదివేవాడు. చదువుతూ, చదువుతూ మధ్యలో ఆగి, ‘ఇది నిజంగా జరిగిందా?’ అని ఆశ్చర్యపోయి, ‘జరిగే ఉంటుంది. లేకపోతే ఎందుకు రాస్తారు’ అనుకునేవాడు.

కలిదిండి సుబ్బరాజు అన్నా నాకిష్టమే. ఆయన చామన ఛాయ రంగులో బలంగా ఆరడుగుల ఎత్తుండేవాడు. పెద్ద మీసాలుండేవి. తలపాగా, పంచె, లాల్చీ ధరించేవాడు. అతనికి ఆస్తిపాస్తులు బాగా ఉండేవి. తరచు సాయంకాలం పూట గోదావరి గట్టుకు షికారుకొచ్చేవాడు.

సుబ్బరాజు వచ్చేటప్పటికి శంకరశాస్త్రి పురాణాలు చదువుతూ ఉండేవాడు. ఇద్దరూ మంచి స్నేహితులు. ఒకరంటే ఒకరికి ఎంతో గౌరవం. పిచ్చాపాటీ మాట్లాడుకునేవారు. నేనూ ఆసక్తిగా వినేదాన్ని. ఒకరి వంశాన్ని ఒకరు మెచ్చుకునేవారు. ఒకోసారి తమ పెద్దల గురించి గొప్పలు చెప్పుకునేవారు. అవి నిజమే అనిపించేవి. వాళ్ళ మాటల్లో, గొప్పల్లో వాళ్ళు అనుసరిస్తున్నవీ, ఆచరిస్తున్నవీ ఉండేవి.

“మా తాతగారు గుర్రమెక్కి, కత్తి పట్టుకుని వేటకెళ్తే ఏ పులినో చంపికానీ వచ్చేవారు కారు. ఆ బలాలూ, బలగాలూ ఇప్పుడెక్కడున్నాయి శాస్త్రిగారూ?”

“నిజమేననుకోండి. అయినా, తమరు మాత్రం తక్కువా రాజుగారూ. ఇప్పటికీ తాలింఖానాకెళ్ళి రోజూ వ్యాయామం చేస్తారు. అవసరమొస్తే ఎంతటి వాళ్ళనైనా ఎదిరిస్తారు. ఆమధ్య బందిపోట్లు మనూరిపై పడ్డప్పుడు మీరే కనుక కత్తి పట్టుకుని ముందుకురక్కపోయుంటే, మనూరి జనం మీ వెనక వచ్చి వాళ్ళను ఎదుర్కొని ఉండేవారా? బందిపోట్లు పలాయనం చిత్తగించి ఉండేవారా?”

మందహాసం చేసి, “అంతా మీ అభిమానం” అని సుబ్బరాజు ఆ ప్రసక్తి మళ్ళించేవాడు.

ఇంకోనాడు, “మా తాతగారు వేదాలు వల్లిస్తుంటే ఎంతో కమనీయంగా ఉండేదట. ఏ యాగం చేయించినా అది తప్పక ఫలించేదట. అప్పటి వాళ్ళ భక్తీ, చిత్తశుద్ధీ ఇప్పుడెక్కడున్నాయి రాజుగారూ?”

“ఆ మాట కాదనలేమనుకోండి. అయినా, మీరు కూడా ఎవరికీ తీసిపోరు. ఆమధ్య వర్షాల కోసం మీచేత యజ్ఞం చేయిస్తే, పది రోజులకల్లా పడలేదా? పైర్లు పచ్చగా కళకళలాడలేదా?”

“అంతా మీ అభిమానం” అని చిరునవ్వుతో శంకరశాస్త్రి మరో విషయం ప్రస్తావించేవాడు.

గత స్మృతులు వాళ్ళకొక తృప్తీ, ధైర్యం ఇచ్చేవని నాకనిపించేది. ఆ స్మృతులను నెమరువేసుకోవడంలో నిజాయితీ ఉండేది. పైగా, వాళ్ళ ప్రవర్తనా అందుకనుగుణంగానే ఉండేది.

కొంతకాలం పోయాక, వయసు పైబడ్డం వల్లేమో వాళ్ళిద్దరూ అప్పుడప్పుడూ గోదావరి గట్టుకొస్తుండేవారు. వాళ్ళ పిల్లలు కృష్ణవేణి, సుదర్శనరాజు మాత్రం తరచు వస్తుండేవారు. కృష్ణశాస్త్రి కవిత్వం గురించీ, చలం కథలు గురించీ మాట్లాడుకునేవారు. కృష్ణవేణి బంగారంబొమ్మలా ఉండేది. తియ్యని గొంతు. ఆమె ఎంకి పాటలు పాడుతుంటే గోదావరి వంత పాడేది. నేనూ ఆనందంతో తలూపేదాన్ని. సాయంకాలాలు రమణీయంగా సాగిపోయేవి. వాళ్ళిద్దరూ కాలేజీ కబుర్లు చెప్పుకుంటుంటే నాకు సరదాగా ఉండేది.

“కృష్ణా, ఇలా ఎన్నాళ్ళు మనం దొంగచాటుగా కలుసుకుంటాం? ఇంకో పది రోజుల్లో మన పరీక్షలయిపోతాయి. పరీక్షలవగానే మన ప్రేమ గురించి మన పెద్దవాళ్ళకు చెప్పేద్దాం.”

“సుదర్శన్, నాకెందుకో భయంగా ఉంది. మన పెద్దవాళ్ళు ఒప్పుకుంటారంటావా?”

"వెంటనే ఒప్పుకోరనుకో. అయినా, ఒప్పిద్దాం."

వాళ్ళలాగ అనుకున్నప్పుడు, వాళ్ళ పెళ్ళి తప్పక జరగాలని నేను గాఢంగా కోరుకున్నాను. మనం కోరుకున్నవన్నీ జరిగితే ఈ లోకం ఇంకెంత సుందరంగా ఉండేదో!

ఓ పదిహేను రోజుల తర్వాత శంకరశాస్త్రీ, సుబ్బరాజూ వచ్చి గట్టు మీద కూర్చున్నారు. ఇద్దరూ చాలాసేపు ముభావంగా ఉన్నారు. చివరకు శంకరశాస్త్రి అన్నాడు:

"రాజుగారూ, నేనాలోచిస్తున్నదే మీరూ ఆలోచిస్తున్నారనుకుంటాను. నాకూ ఏమీ బోధపడ్డం లేదు. కృష్ణవేణికి నచ్చజెప్పడానికి ఎంతగానో ప్రయత్నించాను. అయినా, వినడం లేదు."

"మా సుదర్శన్ వ్యవహారమూ అలానే ఉంది శాస్త్రిగారూ. మీరొప్పుకోకపోతే రిజిస్టర్ మ్యారేజీ చేసుకుంటాననంటున్నాడు."

మళ్ళీ ఇద్దరి మధ్య మౌనం. ఆ మౌనం నాకు భరింప శక్యంగాకుండా ఉంది.

కొంతసేపయ్యాక —

"రాజుగారూ, నేనిలా అంటున్నానని నన్ను తప్పుపట్టకండి. పోనీ, వాళ్ళను మనం ఆశీర్వదిస్తేనో!"

"శాస్త్రిగారూ!" సుబ్బరాజు కేకకు నాకే భయమేసింది.

"వేదవేదాంగ పారంగతులైన తమరేనా ఈ మాటంటున్నది? ఎలా కుదురుతుందండీ? మీరు మీ కులంలోనూ, నేను నా కులంలోనూ తలెత్తుకు తిరగ్గలమా? అయినా, ఇలాంటి తప్పుడు పనుల్ని మనం ప్రోత్సహించడం అన్యాయం కదూ."

"న్యాయం, ధర్మం గురించి ఆలోచిస్తే తప్పు కాదనుకుంటాను రాజుగారూ. మన పూర్వీకుల్లో అలా జరిగిన సంబంధాలు లేకపోలేదండి. అంచేత..."

"నసేమిరా ఒప్పుకోను. మా బావగారికి ఎప్పుడో మాటిచ్చేశాను, వాళ్ళమ్మాయిని మా వాడికి చేసుకుంటానని. నా మాట పట్టింపు ఎటో తమరికి తెలియంది కాదు" అన్నాడు సుబ్బరాజు నెరసిన మీసం మెలేస్తూ.

శంకరశాస్త్రి ముఖం పాలిపోయింది.

'ఏదో మాట పట్టింపు వచ్చి మామగార్ని సుబ్బరాజు తనింటికి రానీలేదు. తనూ వాళ్ళింటికెళ్ళలేదు. అలా పాతికేళ్ళు జరిగింది. మామగారు చనిపోయినప్పుడు కూడా సుబ్బరాజు వెళ్ళలేదు. భార్యను కూడా పుట్టింటికి పంపలేదు. ఇక సుబ్బరాజుతో వాదించి లాభం లేదు' అని గొణుక్కున్నాడు శంకరశాస్త్రి.

వాళ్ళిద్దరూ చాలాసేపు ఉలుకూ పలుకూ లేకుండా కూర్చుని, ఇక వెళ్దాం అన్నట్లుగా కళ్ళతోనే అనుకుని ఇళ్ళకెళ్ళిపోయారు.

ఆ మర్నాడు చీకటిపడ్డాక కృష్ణవేణి వచ్చింది. పచ్చని కొత్త చీర కట్టుకుంది. నీలం రంగు జాకెట్ వేసుకుంది. మెళ్ళో బంగారం నెక్లెస్, జడ మీద నాగసర్పం తగిలించుకుంది. నాగసర్పం తెల్లపాళ్ళు చీకట్లో కూడా మెరిసిపోతున్నాయి.

'సుదర్శన్ ఇంకా రాలేదేమిటి?' అని కృష్ణవేణి చాలాసార్లు పైకే అనుకుంది. ఆమె ఆదుర్దాగా ఉన్నట్లు ఆమె ముఖానికి పట్టిన చెమటే చెబుతోంది.

కృష్ణవేణి గట్టు మీదకు చూస్తూ, మధ్య మధ్య గోదావరి వంక చూస్తోంది. రాత్రి ఎనిమిదయింది.

'ఇంకో అరగంటలో స్టేషన్‌కెళ్ళకపోతే ట్రైన్ మిస్సయిపోతుంది. తమ ఫ్రెండ్ తోట సోంబాబు ఈపాటికి టికెట్లు తీసుకుని స్టేషన్లో ఉండి ఉంటాడు. సుదర్శన్ ఇంకా రాడేం' అనుకుంది కృష్ణవేణి.

తొమ్మిది, తొమ్మిదన్నర, పావుతక్కువ పది... సుదర్శన్ రాలేదు. కృష్ణవేణి వెక్కి వెక్కి ఏడ్చింది.



తన కడుపులో దాచుకునే శక్తి తగ్గిన గోదావరి కృష్ణవేణిని కాటన్ బ్యారేజి వద్ద పైకొదిలేసిందట.

'సుదర్శన్ వాళ్ళ బావజ్జీ మాటకు తలొగ్గేశాడా? అలా చేసేవాడు కాదే. మరెందుకు రాలేదు?' పదేపదే అనుకుంటూ ఏడుస్తూ, కృష్ణవేణి గోదావరిలోకి ఉరికేసింది.

'ఎంత పని చేశావు తల్లీ' అనుకుంటూ నేను విలవిలలాడిపోతూ ఊగిపోయాను.

గుండెలేని గోదావరి కృష్ణవేణిని తన కడుపులో దాచేసుకుంది. తెల్లవారింది. తన కడుపులో దాచుకునే శక్తి తగ్గిన గోదావరి కృష్ణవేణిని కాటన్ బ్యారేజి వద్ద పైకొదిలేసిందట. ఆ రోజు సాయంత్రం సుదర్శనరాజు, సోంబాబు నా దగ్గరకు కలిసి వచ్చారు.

సుదర్శనరాజు కళ్ళు ఉబ్బిపోయి ఉన్నాయి. సోంబాబు దిగులుగా ఉన్నాడు.

"సోంబాబూ, నాకు బతకాలని లేదు. కృష్ణవేణి లేని బతుకు నాకొద్దు" అన్నాడు సుదర్శనరాజు ఏడుస్తూ.

"సుదర్శన్, ఇప్పటికి ఏ వందసార్లో ఆ మాటన్నావు. ఇంత చదువుకున్న మనమే అలా ఆలోచిస్తే ఎలాగ? కృష్ణవేణి తొందరపడింది. మీ నాన్నగారు నిన్ను గదిలో పెట్టి తాళం వేసుండకపోతే, ఈ పాటికి మీరిద్దరూ ఒకటయ్యేవారు. నువ్వు నీ ఇంట్లోనే బందీవయ్యావని నాకు తెలిసినా నేనామెను కాపాడేవాణ్ణి. జరిగేదంతా జరిగిపోయింది. ఇప్పుడేమనుకున్నా ప్రయోజనం లేదు. చచ్చి సాధించేదేమీ ఉండదురా."

"ఈ బాధ తప్పుతుందిరా. కృష్ణవేణి జ్ఞాపకాలు కలచివేస్తుంటే ఎలారా బతకడం?"

"స్మృతులన్నీ మధుర స్మృతులు కాలేవు. మన మనుగడను మట్టుపెట్టే స్మృతుల్ని - మధురస్మృతులైనా సరే - మరచిపోయే ప్రయత్నం చేయాలి."

"అలాగే" అన్నట్లు తలూపాడు సుదర్శనరాజు.

"దట్స్ గుడ్" అని అతని భుజం తట్టి ఇంటికి తీసుకుపోయాడు సోంబాబు.

కొన్నాళ్ళకు సుబ్బరాజూ, శంకరశాస్త్రీ అనుకోకుండా గోదావరి గట్టు మీద కలిశారు. ఎప్పటిలా నా దగ్గరే కూర్చున్నారు.

ఇద్దరూ చాలాసేపు మాట్లాడుకోలేదు.

"శాస్త్రిగారూ, మీకు చాలా కష్టమొచ్చింది. అది నా కారణంగానే కదా అని

నేను అన్నమానం విచారిస్తున్నాను. మీరు కూడా మీ అమ్మాయిని గదిలో పెట్టి తాళం వేసుండాల్సింది.''

శంకరశాస్త్రి సుబ్బరాజు వంక ఓసారి చూసి, శుష్కమందహాసం చేసి, రెండు చేతులూ పైకెత్తి ''మన చేతుల్లో ఏం ఉంది'' అన్నాడు నీరసంగా.

ఆ తర్వాత వాళ్ళిద్దర్నీ కలిసి ఉండగా నేను చూడలేదు.

తండ్రి మాటను సుదర్శనరాజు నిలబెట్టలేదు. ఓ సంవత్సరమయ్యాక అతను విధవావివాహం చేసుకున్నాడు. అతనూ, ఆమే అప్పుడప్పుడూ నా దగ్గర కొచ్చి కాసేపు కబుర్లు చెప్పుకుని వెళ్ళేవారు. తనకో చక్కని బతుకిచ్చి నందుకు సుదర్శనరాజును ఆమె మెచ్చుకుంటూ తన ప్రేమను అతనిపై కురిపించడం నేను చూశాను.

కృష్ణవేణితో పాటు తనూ పోకుండా తను బతికి, మరొకరికి బతుకిచ్చి నందుకు సుదర్శనరాజును నేను చల్లగా తాకాను.

కాలం ఎవరికోసమూ ఆగదు. గాయాల్ని మాన్పుతుంది. సుందర భవితవ్యాన్ని కళ్ళముందు చూపిస్తుంది. తీరా ఆ భవితవ్యం చిందరవందర అయినా తనకేమీ పట్టనట్లు ముందుకెళ్ళిపోతుంది.

శంకరశాస్త్రి పోయాడు. సుబ్బరాజు పోయాడు. సుదర్శనరాజు మంచాన పడ్డాడు. అతని కొడుకు పౌల్ట్రీ నడుపుతున్నాడు. శంకర శాస్త్రి కొడుకు అదే వృత్తి చేస్తూ అర్ధంతరంగా పోయాడు. మనవడు బాటా కంపెనీలో సూపర్‌వైజర్.

అమధ్య ఇక్కడ గచ్చు చప్టా కట్టారు, నలుగురూ కూచోడానికి బావుంటుందని. అయితే, రాత్రయ్యేటప్పటికి అంతా గందరగోళంగా ఉంటోంది. దాదాపు వారానికి రెండు మూడుసార్లు వివేకమూర్తీ, కిశోరవర్మా రాత్రి తొమ్మిది గంటల ప్రాంతాల్లో వస్తారు. ఒకడు భుజానికి తగిలించుకున్న సంచీ చప్టా మీద పెట్టి, అందులోంచి బీరుసీసాలు తీస్తాడు. మరొకడు తన సంచీలోంచి కోడివేపుడు పొట్లాం తీస్తాడు.

తాగుతూ, తింటూ కబుర్లు చెప్పుకుంటూ అర్ధరాత్రి వరకూ గడుపుతారు.

“వర్మా నువ్వేన్ని చెప్పు. మా ముత్తాత శంకరశాస్త్రిగారు వేదాలు వల్లిస్తుంటే పాములు బెదరి పారిపోయేవట. ఆయనకంత పవరుండేదట. తెలివితేటలు సరేసరి.''

“అవునట. నువ్వన్నట్లు ఇప్పటికీ మీ బ్రాహ్మలే తెలివైనవాళ్ళు అందుకే ఉద్యోగాలు ఎక్కువగా మిమ్మల్నే వరిస్తాయి'' అన్నాడు కిశోరవర్మ ఒక బీరు సీసా ఖాళీ చేస్తూ.

వివేకమూర్తి కోడివేపుడు తింటూ ''అజంతాలో బాగా చేస్తారు సుమా'' అన్నాడు లొట్టలు వేస్తూ.

''మా ముత్తాత సుబ్బరాజుగారు అంతెత్తు మనిషట. కత్తి పట్టుకుని యుద్ధానికెళ్తే ఎంతటివాళ్ళయినా పరుగో పరుగట.''



రాత్రి పన్నెండు దాటింది. వాళ్ళు నాలుగో సీసా ఓపెన్ చేశారు. ఇంతలో విజిల్ వినిపించింది.

''రాచపుట్టుకలోనే ఉందా పౌరుషం. అందుకే సాహసానికి మిమ్మల్నే చెప్పు కుంటారు'' అని వివేకమూర్తి రెండో సీసా ఓపెన్ చేశాడు.

కిశోరవర్మ కోడివేపుడు తింటూ బీరుసీసా అందుకున్నాడు.

రాత్రి పన్నెండు దాటింది. వాళ్ళు నాలుగో సీసా ఓపెన్ చేశారు. ఇంతలో విజిల్ వినిపించింది.

''పోలీసులొస్తున్నారంటావా?''

“వస్తే రానీ. మనకేంటీ” అన్నాడు గుటగుటా బీరు తాగుతూ కిశోరవర్మ గంభీరంగా.

బూట్ల చప్పుడు దగ్గరగా వినిపించింది.

“నువ్వన్నట్లు పోలీసులేలాగుంది.''

“ఎవర్రా అక్కడ” అనే గద్దింపు వినగానే -

ఇద్దరూ గబుక్కున లేచి పరుగు లంకించుకున్నారు.

నాకు నవ్వొచ్చింది. గలగలలాడాను.

వివేకమూర్తి పుట్టిక వేదాల ముఖమెరగడు. వాటిలో ఏముందో కూడా తెలీదు. తన ముత్తాతలా గుండు గీయించుకోడు. అతనిలా పుణ్యకార్యాలు జరిపించలేడు. కాలేజీ చదువు అవగానే తన తండ్రి చేస్తున్న బాటా కంపెనీలోనో, మరో దాంట్లోనో గుమాస్తాగా చేరడానికి సిద్ధంగా ఉన్నాడు. ఇక కిశోరవర్మ నాలుగున్నరడుగుల మనిషి. గట్టిగా గాలేస్తే ఎగిరిపోయేలా ఉంటాడు. రక్తం చూస్తే కళ్ళు తిరిగి పడిపోతాడు. తండ్రి నడుపుతున్న పౌల్ట్రీయే అతనికి రానున్న ఆస్తి. డిగ్రీ పాసయి, ఏదన్నా ఉద్యోగం వస్తే చేయడానికి రెడీ. వీళ్ళెవరూ తమ పూర్వీకుల్లా జీవించే అవకాశం లేశమాత్రమైనా లేదు. అయినా, తమ వంశాలు గురించి గొప్పగా ఫీలవుతారు. పూర్వపు పరిస్థితి కొనసాగాలని ఆశిస్తారు. ఈ ప్రపంచం తమ మాటలనూ, చేతలనూ బేరీజు వేసి, నవ్వుకుంటుందనే ఇంగితజ్ఞానం కూడా వాళ్ళకు లేదు. ఇక తెలివితేటలూ, ఉద్యోగాలూ విద్య కారణంగానే వస్తాయని వాళ్ళకు తెలీదు.

స్మృతుల విషయంలో మనిషైనా, సంస్కృతైనా, సాహిత్యమైనా, మరేదైనా ఒకటే. పనికొచ్చేది నిలుస్తుంది. పనికిరానిది పోతుంది. రామాయణ, భారతాలు మానవజాతిని ఏదో ఒక మేర ప్రభావితం చేస్తున్నాయి కాబట్టే అవింకా ప్రాచుర్యం పొందుతున్నాయి. వాటితోపాటు ఇంకెన్నో ప్రాచీన గ్రంథాలున్నా జనం పట్టించుకోకపోవడానికి అవి ఈ కాలానికి పనికిరాకపోవడమే కారణం.

తెల్లవారింది, కూలీలు చాలామంది వచ్చారు. వాళ్ళ చేతుల్లో గునపాలున్నాయి. గొడ్డళ్ళున్నాయి. తాళ్ళున్నాయి. వాళ్ళు తమ పనిలో పడ్డారు. శారీరకంగా నాకు చాలా బాధగా ఉంది. అయినా, భరించక తప్పదు.

కొత్త రైలుబ్రిడ్జికి నేను అడ్డొస్తున్నాను. నా అడ్డు తొలగిస్తేనే రేపు లక్షలాది ప్రయాణీకులు ఆ బ్రిడ్జిపై రైళ్ళలో ప్రయాణించగలుగుతారు. కొన్ని దశాబ్దాలుగా నీడ నిచ్చిన రావిచెట్టుని రైల్వేవాళ్ళు నన్ను దయ తలచడంలేదు. దయ చూపాలని నేను కోరుకోవడం న్యాయం కాదు. నా స్మృతి నేటితో సరి. అదిగో, అదిగో - నా మొదలు నరికేస్తున్నారు. నేల మీదకో, గోదావరిలోకో నేను వాలిపోతాను. ■